RNI NO. TELTEL2010/34557
www.deshatimes.in

# దేశ టైమ్స్
DESHA TIMES
తెలుగు దిన పత్రిక
నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్
DESHA TIMES
16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | జులై 12 బుధవారం 2026 | సంపుటి : 16 | సంచిక : 189 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాషా
NALGONDA | WEDNESDAY AUGUST 12 2026 | VOL:16 | ISSUE: 189 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA

# పేద పిల్లల కలలకు బలమైన పునాదులు వేయాలంటే

## నిజమైన సంకల్పం ఉండాలి: రేవంత్ రెడ్డి

**యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయన్న రేవంత్**

**ప్రతి చిన్నారికి ప్రపంచ స్థాయి విద్యను అందించడమే లక్ష్యమని వ్యాఖ్య**

**తెలంగాణ మోడల్ దేశానికే స్ఫూర్తిగా నిలుస్తుందన్న సీఎం**



భవనాలు నిర్మించడం ఎవరికైనా సులభమే కావచ్చు.. కానీ పేద పిల్లల కలలకు బలమైన పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి నిజమైన సంకల్పం ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయంటూ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. కులం, మతం, ప్రాంతం, పేదరికం అనే అసమానతలను చెరిపేస్తూ... ప్రతీ చిన్నారికీ కార్పొరేట్‌తో సమానమైన ప్రపంచ స్థాయి విద్యను అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక మౌలిక వసతులతో రూపుదిద్దుకుంటున్న ఈ సమీకృత గురుకులాలు సాధారణ పాఠశాలలు మాత్రమే కావని... పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలని సీఎం అన్నారు. పేద పిల్లల ఉన్నత కలలకు శాశ్వత చిరునామాగా నిలుస్తూ, దేశానికే 'తెలంగాణ మోడల్' విద్యారంగానికి ప్రతీకగా నిలిచేలా ఈ యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## రాజకీయ వైరాలు పక్కనబెట్టి ఒకే చోట.. రేవతి సూలే రిసెప్షన్‌లో ప్రధాని మోదీ, అమిత్ షా, రాహుల్ గాంధీ



**వైభవంగా సుప్రియా సూలే కుమార్తె రేవతి సూలే వివాహ రిసెప్షన్**

**రిసెప్షన్ కు తరలి వచ్చిన అగ్ర రాజకీయ నేతలు**

**ఆప్యాయంగా పలకరించుకున్న నేతలు**

ఢిల్లీ వేదికగా దేశ రాజకీయాలలోని దిగ్గజ నేతలందరూ ఒకే వేదికపై కొలువుదీరిన ఒక అరుదైన, ఆసక్తికర ఘట్టం ఆవిష్కృతమైంది. ఎన్సీపీ (ఎస్పీ) వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంపీ సుప్రియా సూలే కుమార్తె రేవతి సూలే – సారంగ్ లఖానీల వివాహ రిసెప్షన్ వేడుక దేశ రాజధానిలోని శరద్ పవార్ నివాసంలో అత్యంత వైభవంగా జరిగింది. నిత్యం రాజకీయ ప్రత్యర్థులుగా పార్లమెంటులోనూ, పబ్లిక్ వేదికలపై సవాళ్లు విసురుకునే అగ్ర నేతలందరూ తమ వైరి వర్గాలను పక్కనబెట్టి

(మిగతా 2వ పేజీలో..)

## కొలంబియాలో భూకంప విలయం..
# 132కి చేరిన మరణాలు


**కొలంబియాను వణికించిన భారీ భూకంపం**

**రిక్టర్ స్కేలుపై 7.4గా నమోదైన తీవ్రత**

**132కి చేరిన మృతుల సంఖ్య.. వందల మందికి గాయాలు**

**దేశంలో జాతీయ ఎమర్జెన్సీ ప్రకటించిన ప్రభుత్వం**

కొలంబియాలో నిన్న భారీ భూకంపం సంభవించి పెను విషాదాన్ని మిగిల్చింది. రిక్టర్ స్కేలుపై 7.4 తీవ్రతతో సంభవించిన ఈ శక్తిమంతమైన భూకంపం ధాటికి ఇప్పటివరకు 132 మంది మరణించగా,



2

## ఆగస్టు 18 నుంచి కేబీఆర్ పార్క్ చుట్టూ వన్-వే ట్రాఫిక్

**ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు చర్యలు**



2

## జీఆర్ఎంబీలో జరిగే మీటింగ్‌ను బాయ్‌కాట్ చేయకపోతే జలసౌధను ముట్టడిస్తాం : కేటీఆర్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆనాడు కేసీఆర్ నాయకత్వంలో 7 ప్రాజెక్టులకు అనుమతిచ్చింది మీ కేంద్ర ప్రభుత్వం.. 7 ప్రాజెక్టులకు ఆనాడు మేము కష్టపడి అనుమతులు సాధించిన తర్వాత ఇవాళ అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టుబడితే జీఆర్ఎంబీ ఎజెండాలో పెట్టారు. మీకు రోషం, పౌరుషం ఉంటే ఆ మీటింగ్‌ను బాయ్‌కాట్ చేయండి.. అని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ విషయమై కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. అసలు బీజేపీ సిగ్గుంటే మీరిచ్చిన అనుమతులు మీరురద్దు చేయాలని మీ పార్ట్‌నర్ ఎవరైతే అడుగుతున్నారో.. ఎందుకు రద్దు చేయాలని వారిని ప్రశ్నించండి..? కేంద్ర ప్రభుత్వమే అనుమతిచ్చి కేంద్రప్రభుత్వ ఆధీనంలో ఉండే జీఆర్ఎంబీని రద్దు చేయాలని అజెండాలో

(మిగతా 2వ పేజీలో..)

## పింగళి వెంకయ్యకు ఇచ్చే నిజమైన గౌరవం భారతరత్న మాత్రమే: వి. హనుమంతరావు

**భారత జాతీయ పతాకాన్ని రూపొందించిన మహనీయుడు పింగళి వెంకయ్య అన్న వీహెచ్**

**భారతరత్న ఇవ్వడం ద్వారానే ఆయనకు నిజమైన గౌరవం లభిస్తుందని వ్యాఖ్య**

**పింగళి సేవలను మోదీ ఎందుకు విస్మరిస్తున్నారో అని ప్రశ్న**

భారత జాతీయ

(మిగతా 2వ పేజీలో..)



## 'కేరళ' ఇకపై 'కేరళం'.. బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**కేరళ పేరును 'కేరళం'గా మార్చే బిల్లుకు లోక్‌సభ ఆమోదం**

**విపక్షాల నిరసనల మధ్య చర్చ లేకుండానే ఆమోదముద్ర**

**కేరళ అసెంబ్లీ చేసిన తీర్మానం మేరకు కేంద్రం చర్యలు**

కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ ప్రతిపాదించిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. మంగళవారం విపక్ష సభ్యుల నినాదాలు, నిరసనల మధ్య ఎటువంటి చర్చ లేకుండానే ఈ బిల్లును సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఫలితంగా రాష్ట్రం పేరు మార్పు

(మిగతా 2వ పేజీలో..)



## చరిత్ర మన్మోహన్ సింగ్‌ను గౌరవంగా గుర్తుంచుకుంటుంది: బొగ్గు కుంభకోణం కేసు క్లీన్ చిట్‌పై సోనియా గాంధీ

**మన్మోహన్ పై రాజకీయ దుష్ప్రచారాలకు తెరపడిందన్న సోనియా**

**విచారణ కోర్టు తీర్పును సుప్రీంకోర్టు తప్పుపట్టడాన్ని స్వాగతించిన సోనియా**

**సీబీఐ, ఈడీ వంటి సంస్థలను రాజకీయాలకు వాడుకుంటున్నారని మండిపాటు**

బొగ్గు బ్లాకుల కేటాయింపు కేసులో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సుప్రీంకోర్టు క్లీన్ చిట్ ఇవ్వడం చారిత్రాత్మక ఘట్టమని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ పేర్కొన్నారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికకు ఆమె రాసిన ప్రత్యేక వ్యాసంలో... సుప్రీంకోర్టు తీర్పుతో మన్మోహన్ సింగ్‌పై ఇన్నాళ్లూ జరిగిన రాజకీయ కక్షసాధింపులకు, దుష్ప్రచారాలకు తెరపడిందని స్పష్టం చేశారు. "నాడు (2014 జనవరిలో) మన్మోహన్



సింగ్ చెప్పినట్లుగానే చరిత్ర ఆయన పట్ల చాలా దయతో, గౌరవంగా ప్రవర్తిస్తుంది" అని ఆమె గుర్తుచేశారు. సీబీఐ దాఖలు చేసిన క్లోజర్ నివేదికను ఆమోదిస్తూ, విచారణ పరిధి దాటి వ్యాఖ్యలు

(మిగతా 2వ పేజీలో..)

తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## రాజకీయ వైరాలు పక్కనబెట్టి ఒకే చోట.. రేవతి సూలే రిసెప్షన్‌లో ప్రధాని మోదీ, అమిత్ షా, రాహుల్ గాంధీ

మొదటి పేజీ తరువాయి)

ఈ వేడుకకు హాజరయ్యారు.ఈ రిసెప్షన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీలతో పాటు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ తదితర ప్రముఖులు విచ్చేసి కొత్త దంపతులను ఆశీర్వదించారు. ప్రధాని మోదీ, అమిత్ షా, శరద్ పవార్ ఒకే ఫ్రేమ్‌లో నిలిచి ఆప్యాయంగా పలకరించుకోవడం, రాహుల్–సోనియా కుటుంబ సమేతంగా పవార్ కుటుంబంతో ముచ్చటించడం నెటిజన్లు, మీడియా దృష్టిని విశేషంగా ఆకర్షించింది.

## ‘కేరళ’ ఇకపై ‘కేరళం’.. బిల్లుకు లోక్‌సభ ఆమోదం

మొదటి పేజీ తరువాయి)

ప్రక్రియలో మరో కీలక ఘట్టం పూర్తయింది.కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో లేకపోవడంతో, ఆయన తరఫున హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ‘కేరళ (పేరు మార్పు) బిల్లు, 2026’ను ప్రవేశపెట్టారు. ఢిల్లీలో నిరసనకారులపై పోలీసుల చర్యలతో పాటు ఇతర కీలక అంశాలపై అమిత్ షా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఆందోళన చేపట్టాయి. ఈ గందరగోళ పరిస్థితుల నడుమనే బిల్లుకు సభ ఆమోదం ముద్రవేసింది. మలయాళంలో తమ రాష్ట్రాన్ని ‘కేరళం’ అని పిలుస్తారని, అధికారికంగా కూడా అదే పేరును ఖరారు చేయాలని కేరళ శాసనసభ 2024 జూన్‌లో తీర్మానం చేసింది. ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన అనంతరం, రాష్ట్రపతి ఈ ముసాయిదా బిల్లును రాష్ట్ర అసెంబ్లీకి పంపారు. 2026 జులైలో అసెంబ్లీ దీనికి ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ బిల్లు ఆమోదంతో రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్‌లో సవరణలు జరగనున్నాయి.

## చరిత్ర మన్మోహన్ సింగ్‌ను గౌరవంగా గుర్తుంచుకుంటుంది: బొగ్గు కుంభకోణం కేసు క్లీన్ చిట్‌పై సోనియా గాంధీ

మొదటి పేజీ తరువాయి)

చేసిన విచారణ కోర్టు తీరును సుప్రీంకోర్టు తప్పుపట్టడాన్ని సోనియా గాంధీ స్వాగతించారు. మన్మోహన్ సింగ్ సమగ్రతను, మచ్చలేని రాజకీయాన్ని దెబ్బతీసేందుకు అప్పట్లో రాజకీయ ప్రత్యర్థులు, కొందరు అధికారులు మరియు మీడియా ప్రణాళికాబద్ధంగా కుట్ర పన్నారని ఆరోపించారు. ప్రస్తుత మోదీ ప్రభుత్వంపై మండిపడుతూ... సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను రాజకీయ అవసరాలకు వాడుకుంటున్నారని విమర్శించారు. యూపీఏ హయాంలో సాధించిన ఆర్థిక పురోగతి, ఉపాధి హామీ, విద్యా హక్కు, ఆహార భద్రత చట్టాల ప్రాధాన్యతను వివరిస్తూ.. మన్మోహన్ సింగ్ ప్రశాంతంగా ఉన్నప్పటికీ దేశానికి అత్యంత కీలకమైన సేవలు అందించిన ప్రధానిగా నిలిచిపోతారని కొనియాడారు.

## కొలంబియాలో భూకంప విలయం.. 132కి చేరిన మరణాలు

మొదటి పేజీ తరువాయి)

వందల మంది గాయపడ్డారు. ఈ శతాబ్దంలో దేశంలో ఇదే అత్యంత తీవ్రమైన భూకంపమని అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. చోకో డిపార్ట్‌మెంట్‌లోని శాన్ జోస్ డెల్ పల్మార్ సమీపంలో సుమారు 100 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. భూప్రకంపనల ధాటికి పెరీరా, కాలీ, మణిజాలెస్ వంటి నగరాల్లో భవనాలు పేకమేడల్లా కూలిపోయాయి. మణిజాలెస్‌లోని ఓ చర్చి టవర్ కూలిపోతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ప్రకంపనలు రాగానే ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.దేశవ్యాప్తంగా నేషనల్ ఎమర్జెన్సీ ఈ విపత్తు నేపథ్యంలో దేశాధ్యక్షుడు అబెర్లార్డో డి లా ఎస్ప్రియెల్లా దేశవ్యాప్తంగా నేషనల్ ఎమర్జెన్సీని ప్రకటించారు. భూకంపం వల్ల 1,500కు పైగా ఇళ్లు దెబ్బతినగా, 61 భవనాలు పూర్తిగా నేలమట్టమయ్యాయని అధికారులు వెల్లడించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక బృందాలు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నాయి. ఈ క్రమంలో ఆరు నెలల చిన్నారిని సురక్షితంగా కాపాడారు. పసిఫిక్ ‘రింగ్ ఆఫ్ ఫైర్’ ప్రాంతంలో కొలంబియా ఉండటమే భూకంప తీవ్రతకు కారణమని నిపుణులు చెబుతున్నారు.

## పింగళి వెంకయ్యకు ఇచ్చే నిజమైన గౌరవం భారతరత్న మాత్రమే: వి. హనుమంతరావు

మొదటి పేజీ తరువాయి)

పతాకాన్ని రూపొందించిన మహనీయుడు పింగళి వెంకయ్యకు అత్యున్నత పౌర పురస్కారమైన ‘భారతరత్న’ ప్రకటించాలని తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. కోట్లాది మంది ప్రజల గుండెల్లో నిలిచిన త్రివర్ణ పతాకాన్ని అందించిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడికి భారత ప్రభుత్వం ఇవ్వగల ఏకైక సముచితమైన నివాళి భారతరత్న మాత్రమేనంటూ ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఓ బహిరంగ లేఖ రాశారు.కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్న ‘హర్ ఘర్ తిరంగా’ పిలుపును స్వాగతిస్తూనే... జాతీయ జెండా రూపకర్త విషయంలో కేంద్రం చూపుతున్న నిర్లక్ష్యాన్ని వీహెచ్ ఎండగట్టారు. దేశమంతటా త్రివర్ణ పతాకం సగర్వంగా రెపరెపలాడుతున్నప్పుడు, దానికి ప్రాణం పోసిన తెలుగు నేల ముద్దుబిడ్డ పింగళి వెంకయ్య సేవలను ప్రధాని మోదీ ఎందుకు విస్మరిస్తున్నారో అర్థం కావడం లేదని ఘాటుగా ప్రశ్నించారు. పింగళి వెంకయ్యకు భారతరత్న ఇస్తేనే ప్రతి భారతీయుడికి, సమరయోధుల త్యాగాలకు సరైన గౌరవం దక్కుతుందని స్పష్టం చేశారు. గతంలోనే తాను హైదరాబాద్‌లో పింగళి వెంకయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఇప్పటికైనా కేంద్రం స్పందించి ఈ మహత్తర నిర్ణయం తీసుకోవాలని లేఖలో కోరారు.

# జీఆర్ఎంబీలో జరిగే మీటింగ్‌ను బాయ్‌కాట్ చేయకపోతే జలసౌధను ముట్టడిస్తాం : కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

పెడుతుంటే సిగ్గులేకుండా మాట్లాడటానికి బీజేపీవాళ్లకు ఏరకంగా మనసు వస్తుందో.. ఏ రకంగా నోరు వస్తుందో నాకైతే అర్థం కావడం లేదు. నీళ్లు, నిధులు, నియామకాలు.. వీటి ఆధారంగా జరిగిన ఉద్యమమే తెలంగాణ ఉద్యమం. అలాంటి ఉద్యమంలో మేం రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా బ్రహ్మాండంగా రాష్ట్రం సాధించిన తర్వాత ఒక్కో నీటి బొట్టును ఒడిసి పట్టి తెలంగాణ బీడు భూములకు మలిపే ప్రయత్నం చేసినం.అది కాళేశ్వరం, సీతారామ, పాలమూరు–రంగారెడ్డి అయితేనేమీ.. ఇంకా చనాకా–కొరాట లాంటి చిన్న ప్రాజెక్టులు చాలా ఉన్నాయి. అలాంటి అన్నీ ప్రాజెక్టులు వాటితోపాటు మిషన్‌కాకతీయ ప్రాజెక్టులన్నీ చేసి తెలంగాణ నీటి వనరులకు పెద్ద ఎత్తున న్యాయం జరిగే విధంగా, నీటి వనరులను కాపాడుకునే విధంగా మేం ప్రయత్నం చేశాం. అందులో భాగంగా అనుమతులు తెచ్చాం. ఇవాళ ఆ అనుమతులన్నింటిని తుంగలో తొక్కుతం. మా చెప్పు చేతల్లో కేంద్రప్రభుత్వం ఉంది.. కేంద్రం జుట్టు నా చేతుల్లో ఉంది కాబట్టి నేను ఆడించినట్టే ఆడాలని చంద్రబాబు నాయుడు అనుకుంటే పోరాటం చేసేందుకు మేం సిద్దంగా ఉన్నామన్నారు. చంద్రబాబునాయుడుకు, ఏపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా. మా నాయకుడు కేసీఆర్ బేసిన్లు లేవు.. బేషజాలు లేవు నీళ్లు వాడుకుందామని ఎప్పుడో చెప్పారు. కానీ మా కడుపు కొట్టి మా ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేస్తామంటే ఊరుకోం. మీరు పోలవరం కట్టుకుంటే మేమేం అనలేదు కదా.. మీరు పట్టి సీమ నీళ్లు లిఫ్ట్ చేసుకుంటుంటే మేమేం అనలేదు. మాకొచ్చిన అనుమతులను చెడగొట్టకండి అని మేం అంటున్నం. కేంద్రప్రభుత్వం నా చెప్పుచేతల్లో ఉంది.. నేను ఆడిచ్చినట్టు ఆడే చెంచాగాడు తెలంగాణ ముఖ్యమంత్రి ఇక్కడున్నడు కదా.. అని అనుకుంటే తెలంగాణ రైతుల తరపున పోరాటమ చేసేందుకు మేం సిద్దంగా ఉన్నామన్నారు. జలసౌధలో జరిగే మీటింగ్‌ను రాష్ట్ర ప్రభుత్వం బాయ్‌కాట్ చేయకపోతే.. ఎజెండా మార్చి ఈ 7 ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే అంశాలను తొలగించకపోతే తెలంగాణలో తప్పకుండా జల ఉద్యమం నిర్మాణం చేస్తామని చెప్పాం. అవసరమైతే ఆ రోజు జలసౌధను ముట్టడిస్తామని హెచ్చరించారు.

# ఆగస్టు 18 నుంచి కేబీఆర్ పార్క్ చుట్టూ వన్–వే ట్రాఫిక్

**ఇప్పటికే ట్రయల్ రన్ విజయవంతమైందని తెలిపిన పోలీసులు**

ప్రయాణికులు కొత్త మార్గాలను అనుసరించాలని సూచన

హైదరాబాద్‌లోని కాసు బ్రహ్మానంద రెడ్డి (కేబీఆర్) నేషనల్ పార్కు పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 18వ తేదీ నుంచి పార్కు చుట్టూ వన్–వే ట్రాఫిక్ విధానాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. హెచ్–సిటీ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనుల దృష్ట్యా ఈ మార్పులు చేస్తున్నట్లు వెల్లడించారు.నిర్మాణ పనుల కారణంగా రహదారి వెడల్పు తగ్గడంతో పాటు వాహనాల రద్దీ గణనీయంగా పెరిగిందని పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ వివరించారు. దీనివల్ల ఉభయ దిశల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, అందుకే వన్–వే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ విధానాన్ని పూర్తిస్థాయిలో అమల్లోకి తీసుకురావడానికి ముందు నిర్వహించిన పైలట్ ట్రయల్స్ ద్వారా ప్రణాళికను మరింత మెరుగుపరిచినట్లు ఆయన పేర్కొన్నారు.నూతన విధానం అమలు కోసం పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధాన కూడళ్లలో లేన్ మార్కింగ్, లేన్ ఛేంజర్లు, దిశను సూచించే సైన్ బోర్డులను ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు 24 గంటల పాటు ట్రాఫిక్ సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. అలాగే, నావిగేషన్ యాప్‌లను సైతం అప్‌డేట్ చేశారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, సీసీటీవీ నెట్‌వర్క్, డ్రోన్ల ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ మార్పులు చేస్తామని వెల్లడించారు. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ఈ వన్–వే విధానం అమలులో ఉంటుందని పోలీసులు స్పష్టం చేశారు. వాహనదారులు తమ ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని, నిర్దేశించిన మార్గాల్లోనే ప్రయాణించాలని కోరారు. ముఖ్యంగా ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యతిరేక దిశలో వాహనాలు నడపవద్దని వారు సూచించారు.

# దేశ నిర్మాణంలో భాగస్వాములు కండి: సీఎం చంద్రబాబు పిలుపు

**‘పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్’కు సీఎం చంద్రబాబు పిలుపు**

**‘రోడ్ డాక్టర్’ పేరుతో గుంతల్లేని రహదారుల మిషన్**

**ప్రజలు, ఉద్యోగులు అంతా భాగస్వాములు కావాలని సూచన**

**జులై నెలలో 10.70 శాతం ఆర్థిక వృద్ధి నమోదు**

**ఎల్ నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక**

ప్రజలు, ఉద్యోగులు, అధికారుల సమష్టి భాగస్వామ్యంతో ‘పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులే లక్ష్యంగా ‘రోడ్ డాక్టర్’ పేరుతో ‘జీరో పాట్ హోల్ మిషన్’ను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సులభతరంగా చేరువ చేయడం ద్వారా ప్రతి ఒక్కరినీ జాతి నిర్మాణంలో భాగస్వాములను చేయాలని ఆకాంక్షించారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రతి అధికారి, ఉద్యోగి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టేలా ‘రోడ్ డాక్టర్’ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పనులను చిత్తశుద్ధితో చేపట్టినప్పుడు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందని, భోగాపురం విమానాశ్రయ పనుల పురోగతికి లభిస్తున్న స్పందనే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. వాస్తవాలను ప్రజలకు వివరిస్తే వారే ప్రభుత్వానికి అండగా నిలుస్తారని, కర్నూలులో డీఎస్సీ–2025 ఉపాధ్యాయ అభ్యర్థులు చేపట్టిన కార్యక్రమమే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. జులై నెలలో రాష్ట్రం 10.70 శాతం ఆర్థిక వృద్ధిని సాధించిందని వెల్లడించిన ఆయన, రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం
ఆగస్టు । బుధవారం । 12 । 2026



# న్యూ విజన్ జూనియర్ కాలేజీ వద్ద నిత్యం ట్రాఫిక్ అంతరాయం

**పార్కింగ్ సౌకర్యం లేక రహదారిపైనే వాహనాలు.. స్థానికులకు తీవ్ర ఇబ్బందులు**

**కాలేజీ యాజమాన్యం ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తోందని స్థానికుల ఆరోపణ**

**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 11(దేశ టైమ్స్ )**

ఖమ్మం బైపాస్ రోడ్డులోని న్యూ విజన్ జూనియర్ కాలేజీ క్యాంపస్ వద్ద ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో భారీగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజు ఉదయం 7:00 గంటల నుండి 8:00 గంటలు ముఖ్యంగా సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు కళాశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది వాహనాలతో బైపాస్ రోడ్డుపై రద్దీ ఏర్పడి, హైవేపై రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోందని చెబుతున్నారు.కళాశాలలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉన్నప్పటికీ, వారి వాహనాలను నిలిపేందుకు సరైన పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు రహదారి పక్కనే, కొన్నిసార్లు ప్రధాన రహదారిపైనే నిలిపివేయడం వల్ల ట్రాఫిక్ స్తంభిస్తోందని పేర్కొంటున్నారు. అత్యంత రద్దీగా ఉండే బైపాస్ రోడ్డులో ఈ పరిస్థితి ప్రమాదాలకు కూడా దారితీసే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.విద్యార్థుల భద్రతతో పాటు రహదారి భద్రతను దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన యాజమాన్యం, పార్కింగ్ సమస్యపై తగిన చర్యలు తీసుకోకుండా వ్యవహరిస్తోందని స్థానికులు మండిపడుతున్నారు. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయడంపైనే దృష్టి పెట్టి, క్యాంపస్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలు, ముఖ్యంగా పార్కింగ్ వంటి అంశాలను పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.ఈ విషయంపై ప్రశ్నించిన స్థానికులతో కాలేజీ




యాజమాన్యం సరైన రీతిలో స్పందించకుండా కాలయాపన చేస్తోందని వారు అంటున్నారు. ప్రతిరోజూ ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.డీఈఓ తక్షణమే స్పందించాలి ఈ సమస్యపై ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు తక్షణమే స్పందించి న్యూ విజన్ జూనియర్ కాలేజీ పరిసరాలను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. కళాశాలకు సరైన పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయడం, రహదారిపై వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవడం, విద్యార్థుల రాకపోకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం వంటి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. పార్కింగ్‌కు అనువైన స్థలం లేకుండా, నిత్యం ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్నట్లయితే ప్రజలకు, విద్యార్థులకు ఇబ్బంది కలగని ప్రత్యామ్నాయ ప్రదేశానికి క్యాంపస్‌ను మార్చే అంశాన్ని కూడా అధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.“విద్యాసంస్థ నిర్వహణతో పాటు ప్రజల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కూడా ముఖ్యమే. అధికారులు ఇప్పటికైనా స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి” అని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# తండాల గ్రామపంచాయతీలకురెవిన్యూ హోదాఇచ్చిఅభివృద్ధిబోర్డును ఏర్పాటు చేయాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అల్వాల వీరయ్య**

**సిపిఎం మరిపెడ మండల కార్యదర్శి గుండ గాని మధుసూదన్**

**మహబూబాబాద్/ మరిపెడ ఆగస్టు 11 దేశ టైమ్స్**

నూతనంగా ఏర్పడిన తండాల గ్రామపంచాయతీలకు రెవిన్యూ హోదా ఇచ్చి అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేయాలని సిపిఎం మహబూబాద్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అల్వాల వీరయ్య మండల కార్యదర్శి గుండ గాని మధుసూదన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఆగస్టు 11 మంగళవారం రోజున సిపిఎం బృందం చింతల గడ్డ తండాను సందర్శించారు అనంతరం వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా మౌలిక సదుపాయాలు లేక అభివృద్ధిలో వెనుకబడి ఉన్న తండాలను గ్రామపంచాయతీ లుగా గుర్తించాలని అనేక పోరాటాల ఫలితంగా గత రాష్ట్ర ప్రభుత్వం 3146 తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించింది కానీ వాటికి రెవిన్యూ హోదా కల్పించకపోవడం తో పాటు అభివృద్ధికి ప్రత్యేకంగా కేటాయిస్తామన్న నిధులను ఇవ్వకపోవ డంతో తండాలలో స్థానిక సమస్యలు సీసీ రోడ్లు సైడ్ డ్రైనేజీ వ్యవస్థ పాఠశాల భవనాలు అంగన్వాడి కేంద్రాల భవనాలు ఆరోగ్య కేంద్రాలు పశు వైద్య శాలలు సరియైన వసతులు లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు రాష్ట్రంలో చిన్న చిన్న తండా ఆవాసాలు పదివేలకు పైగా గిరిజన తండాలు ఉన్నాయి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నూతనంగా ఏర్పడిన తండాల గ్రామపంచాయతీలకు రెవిన్యూ హోదా కల్పించి ప్రత్యేక



నిధులు ఇస్తామని హామీ ఇచ్చింది కానీ రెండున్నర ఏండ్లు గడిచిన హామీని నిలబెట్టుకోలేకపోయింది ఇప్పటికైనా ప్రభుత్వం తండాల గ్రామపంచాయతీలకు రెవిన్యూ హోదా ఇచ్చి ప్రత్యేక అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేసి మూడు వేల కోట్లు కేటాయించి తాండాలలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో గిరిజనులందరినీ ఏకం చేసి ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని వారన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు బాణాల రాజన్న, నలబోలు లక్ష్మారెడ్డి పుల్లూరి క్రాంతి కుమార్ గిరిజన సంఘం నాయకులు బానోత్ జగదీష్ బాస్ నాయక్ భూక్య చంద్రు, ఆంగోత్ దోలి, బానోత్ బుల్లి, ఆమ్గోత్ మంత్యా నాయక్, హత్తి రామ్, లచ్చి, బుజ్జి,స్థానిక తండావాసులు పాల్గొన్నారు

# సొంత ఖర్చులతో జిల్లా లైబ్రరీకి 30 వేల పుస్తకాలు వితరణ చేసిన చైర్మన్

**భావితరాల విజ్ఞానం కోసం పుస్తకాన్ని మించిన సాధనం లేదు**

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి**

**మహబూబాబాద్/మరిపెడ, ఆగస్టు.11(దేశ టైమ్స్)**

మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి, జిల్లా గ్రంథాలయ పాఠకులు పోటీ పరీక్షల సంబంధించిన పుస్తకాలు పాఠకుల సౌకర్యార్థం కోసం ప్రతి చదువరికి పుస్తకం ఉండాలని తలంపుతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి తన సొంత ఖర్చులతో 30 వేల రూపాయల కాంపిటీటివ్ ఎగ్జామ్స్ సంబంధించిన గ్రూప్ వన్, గ్రూప్ టు ,ఎస్సై , కానిస్టేబుల్స్ ,బ్యాంకు, జూనియర్ లైన్ మెన్, అట్లాస్ ఇండియన్ పాలిటి, తెలంగాణ చరిత్ర ,భారత చరిత్ర , ఇంకా అనేక పుస్తకాలు, జిల్లా కేంద్ర గ్రంథాలయానికి వితరణ చేశారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మనకు తెలియని ప్రపంచాన్ని మనకు చూపించి మన నడవడిక ఆలోచనలు సక్రమార్గంలో పయనించడానికి భావితరల విజ్ఞానం కోసం పుస్తకానికి మించిన సాధనం ఏది లేదని , కాబట్టి ప్రతి పాఠకుడు ఈ కాంపిటీటివ్ పుస్తకాలను వినియోగించుకొని పోటీ పరీక్షల్లో విజేతలై తల్లిదండ్రుల ఆశయాలు నెరవేరుస్తూ, సమాజాభివృద్ధికి దోహదపడాలని కోరారు.అనంతరం గ్రంథాలయ పాఠకులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఔదార్యానికి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు ,జి విజేందర్ ,రుద్రారపు వీరేందర్, మరియు నరసింగం శ్రీనివాస్, మందుల రఘు,భూలక్ష్మి యాదమ్మ గ్రంథాలయ పాఠకులు గోపాల్ ,నవీన్,సురేష్ ప్రవల్లిక ,జ్యోతి , శారద తదితరులు పాల్గొన్నారు.



# మరిపెడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు

**వైద్యాధికారిడాక్టర్ గుగులోతు రవి ఆధ్వర్యంలో**



**మహబూబాబాద్/మరిపెడ ఆగస్టు 11 (దేశ టైమ్స్)**



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి ఆధ్వర్యంలో మంగళవారం ఇటుకల గడ్డ తండ గ్రామపంచాయతీ, ఎంజేపీటీబీసీ గర్ల్స్ రెసిడెన్షియల్ స్కూల్ మరియు కాలేజీతో పాటు, కేజీబీవీ స్కూల్‌లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఇటుకల గడ్డ తండ , ఎంజేపీటీబీసీ కాలేజీ పరిధిలో 150 మందికి, అలాగే కేజీబీవీ స్కూల్‌లో 100 మంది విద్యార్థినులకు వైద్య బృందం సమగ్ర పరీక్షలు నిర్వహించింది. మొత్తం 250 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు, విద్యార్థినులు సీజనల్ వ్యాధుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం ద్వారా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులను అరికట్టవచ్చని అవగాహన కల్పించారు.ఈ ఉచిత ఆరోగ్య శిబిరాల్లో డాక్టర్ స్వామి, డాక్టర్ కిరణ్, హెల్త్ సూపర్‌వైజర్ ఆచార్యులు, ఏఎన్ఎంలు శ్రీదేవి, నాగమణి మరియు ఆశా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొని సేవలు అందించారు.

## ఆరూరులో దివంగత తుమ్మల నరసయ్య 3 వ వర్ధంతి

**వలిగొండ: ఆగస్ట్ 11(దేశ టైమ్స్)**



దివంగత సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ తుమ్మల నరసయ్య 3 వ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం ఆయన స్వగ్రామమైన నరసయ్య గూడెం ఆరు గ్రామాలలో ఘనంగా నిర్వహించారు ఈ రెండు గ్రామాలలో ఉన్న తుమ్మల నరసయ్య విగ్రహానికి పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ మాట్లాడుతూ తుమ్మల నరసయ్య సుదీర్ఘంగా కాంగ్రెస్ పార్టీలో ఏళ్ల తరబడి పార్టీ కోసం పని చేసి చివరి ప్రాణం పోయే వరకు కూడాకాంగ్రెస్ పార్టీ జెండాను వదలలేదని వారన్నారు ఆయన కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు మరిచిపోలేని మని ఆయన ఆశయ సాధన కోసం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పనిచేయాలని కోరారు ఆయన బ్రతికున్నంత కాలం నిరంతరం ప్రజల మధ్యనే ఉండి పార్టీకి నిస్వార్థంగా సేవలందించాడని ఆయన చేసిన సేవలు ఏనాడు కూడా చెదిరిపోనివని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజు వలిగొండ సింగల్ విండో చైర్మన్ గరిసె రవి మత్స్యగిరి గుట్ట చైర్మన్ తుమ్మల శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి చెరుకు శివయ్య గౌడ్ వలిగొండ పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకి రాములునాయకులు చిట్టెడి జనార్దన్ రెడ్డి గంగాపురం సతీష్ కాసుల వెంకన్న గౌడ్ గుండు దానయ్య వలిగొండ సింగిల్ విండో వైస్ చైర్మన్ జంగారెడ్డి ఐటి పాముల రవీంద్ర బాల శంకర్ మచ్చ గిరి గుట్ట డైరెక్టర్లు రాధారపు రమేష్ కూర వెంకన్న జినుకల దానయ్య బండారు నరసింహారెడ్డి నరసయ్య కుటుంబ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు


## జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈనెల 13వ తేదీన తలపెట్టిన బీసీ ఎస్సి ఎస్టీ జెఏసి భారీ బహిరంగ సభను విజయవంతం చేయండి

జగిత్యాల జిల్లా, భీమారం మండల కేంద్రంలోనిర్వహించిన మీడియా సమావేశంలో బీసీ ,ఎస్సి , ఎస్టీ –జె ఎ సి ఆధ్వర్యంలో సామాజిక న్యాయం రాజ్యాధికారం కై ఎవరి కులం ఎంతో వారికంత వాటా బహిరంగ పంచాయితీ – సభ ఈ నెల 13 వ తేదీన సాయంత్రం 4:00 గంటలకి స్థలం వాసవి కళ్యాణ మండపం కరీంనగర్ రోడ్ జగిత్యాల ఈ సభ కి బీసీ ,ఎస్సి ,ఎస్టీ90%ప్రజలు,మేధావులు ,విద్యావంతులు, కుల సంఘాల నాయకులు,యువకులు అధిక సంఖ్యలో బహిరంగ పంచాయతీ సభ నీ విజయవంతంచేయాలని నిర్వహించిన మీడియా సమావేశంలో, రాష్ట్ర కార్యదర్శి చిలివేరు.శ్రీకాంత్ అన్నారు.ఈకార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేష్ మహారాజ్, కార్యదర్శి అశోక్, జిల్లా నాయకులు బాబు, ప్రశాంత్, మణిదీప్, రామస్వామి పాల్గొన్నారు.



తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## మంచి కథలతో రండి.. అవకాశమిస్తాం: కొత్త దర్శకులకు అక్కినేని నాగార్జున బంపర్ ఆఫర్



మంచి కథలతో వచ్చే కొత్తవారికి అవకాశాలు ఇచ్చి సినిమాలు నిర్మించేందుకు తమ అన్నపూర్ణ స్టూడియోస్ సిద్ధంగా ఉందంటూ టాలీవుడ్ 'కింగ్' అక్కినేని నాగార్జున అదిరిపోయే ప్రకటన చేశారు. 'పళ్ళ బురుసు' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... మంచి కథ ఉన్నవారు ఎవరైనా సరే నేరుగా అన్నపూర్ణ స్టూడియోను సంప్రదించవచ్చని పిలుపునిచ్చారు. స్టూడియో అంటే కేవలం లీజుకు ఇచ్చి డబ్బులు సంపాదించడం మాత్రమే కాదని, తిరిగి సినీ రంగానికి సేవ చేయాలనే ఉద్దేశంతోనే కొత్త దర్శకులతో చిత్రాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు.ఇటీవల 'లెనిన్' సినిమాతో మంచి విజయాన్ని సాధించామని, ఇప్పుడు 'పళ్ళ బురుసు' నిర్మించి రిలీజ్ చేస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో 'రంభ, ఊర్వశి, మేనక'తో పాటు తన ప్రతిష్ఠాత్మక 100వ చిత్రం 'కింగ్ 100' కూడా అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై రాబోతున్నట్లు నాగార్జున వెల్లడించారు. కాగా, గోమతి రెడ్డి, సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ప్రజ్వల్ యాద్మా ప్రధాన పాత్రల్లో ఉదయ్ చౌహాన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'పళ్ళ బురుసు' చిత్రం అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్త నిర్మాణంలో ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ఉదయనిధి వ్యాఖ్యల దుమారం.. త్రిష వరుస పోస్టులు వైరల్!




తమిళనాడు రాజకీయాల్లో ప్రకంపనలు రేపిన ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యల వివాదం నేపథ్యంలో నటి త్రిష ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన పోస్టులు వైరల్‌గా మారాయి. ఉదయనిధి వ్యాఖ్యలపై ఆమె నేరుగా స్పందించకపోయినా. . వరుస పోస్టులతో పరోక్షంగా ఆయనకు సమాధానం ఇచ్చారా అనే చర్చ మొదలైం ది.తన అమ్మమ్మ 98వ పుట్టినరోజు వేడుకలకు సంబంధించిన ఫొటోలను త్రిష ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకుంది. వాటితో పాటు కొన్ని సందేశాలను కూడా షేర్ చేసింది. "ఈ వయసులోనూ డ్రామాలు చేయడం ఏంటి? నీ పని నువ్వు చూసుకో.. డబ్బు సంపాదించుకో.. ప్రశాంతంగా ఉండు" అంటూ ఉన్న పోస్ట్‌ను పంచుకుంది. దానికి కనుబొమ్మ పైకెత్తిన ఎమోజీని జత చేసింది.మరో సందేశంలో "మీరు చేసే ప్రతి పనీ తిరిగి మీ దగ్గరకే వస్తుంది. మంచిగా ఉండండి.. మంచే చేయండి" అని ఉంది. "ఇకపై మీకు అన్నీ సవ్యంగా జరిగే అధ్యాయం మొదలైంది" అనే మరో సందేశాన్ని కూడా ఆమె పంచుకుంది. "రిస్క్ తీసుకునేవారే గెలుస్తారు" వంటి సందేశాలు కూడా ఉన్నాయి."ఒకప్పుడు కోరుకున్న జీవితంతో ఇప్పుడు ఉక్కిరిబిక్కిరవడం ఎంత గొప్ప అదృష్టం" అంటూ మరో పోస్ట్‌ను త్రిష షేర్ చేసింది. అయితే ఈ పోస్టులన్నీ ఉదయనిధిని ఉద్దేశించేనా? అన్న దానిపై ఆమె స్పష్టత ఇవ్వలేదు.ఇటీవల కావేరీ జలాల అంశంపై తంజావూరులో జరిగిన ఆందోళన కార్యక్రమంలో ఉదయనిధి ప్రసంగించారు. ఈ సందర్భంగా త్రిష పేరుతో నినాదాలు రావడంతో ఆయన చేసిన వ్యాఖ్య వివాదాస్పదమైంది. దీనిపై రాజకీయంగా తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో త్రిష తాజా పోస్టులు చర్చనీయాంశంగా మారాయి.

## వివాదంలో సింగర్ రాహుల్ సిప్లిగంజ్.. యువతి ఫిర్యాదుతో కేసు నమోదు

ప్రముఖ గాయకుడు, బిగ్‌బాస్ విజేత రాహుల్ సిప్లిగంజ్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. 'నాటు నాటు' పాటతో అంతర్జాతీయ ఖ్యాతి పొందిన ఆయనపై విశాఖపట్నంలో కేసు నమోదైంది. ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాహుల్ సిప్లిగంజ్‌తో పాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు.విశాఖకు చెందిన ఓ యువతి ఫిర్యాదు ప్రకారం.. కర్పూరపు రాహుల్ రెడ్డి అనే వ్యక్తి తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా, వ్యక్తిగత ఫొటోలు, వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ వ్యవహారంలో సింగర్ రాహుల్ సిప్లిగంజ్ కూడా జోక్యం చేసుకున్నారని యువతి ఆరోపించారు. రాహుల్ రెడ్డికి బంధువునని చెప్పి, తనను బెదిరించారని, బలవంతంగా కొన్ని వీడియో స్టేట్‌మెంట్లు ఇప్పించారని ఆమె తన ఫిర్యాదులో వివరించారు.యువతి ఫిర్యాదుతో రాహుల్ సిప్లిగంజ్‌తో సహా మొత్తం 16 మందిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. వీరిలో మధ్యవర్తిత్వం చేసిన కొందరు జర్నలిస్టులు, హైకోర్టు న్యాయవాది గీతా ప్రసన్న చందన కూడా ఉన్నట్లు సమాచారం. తొలుత ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, తదుపరి విచారణ నిమిత్తం దీనిని ఎండాడ మహిళా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ దశలో ఉంది. యువతి చేసిన ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఆరోపణలపై రాహుల్ సిప్లిగంజ్ నుంచి గానీ, ఆయన ప్రతినిధుల నుంచి గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# కోరుట్ల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్



**● కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి -- ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి:**

కోరుట్ల పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్ గారు ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న పోలీస్ సేవలను నిరంతరం పర్యవేక్షించే క్రమంలో భాగంగా ఎస్పీ గారు ఈ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల వివరాలు తదితర అంశాలను ఎస్పీ గారు పరిశీలించారు. ప్రతి కేసులో దర్యాప్తును నిబంధనల ప్రకారం సమర్థవంతంగా చేపట్టి, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.అలాగే పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న స్టేషన్ రికార్డులు, కేసు డైరీలు, వివిధ రిజిస్టర్లు పరిశీలించారు. పోలీస్ సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ, బాధ్యతాయుతంగా వ్యవహరించడం ఎంతో ముఖ్యమని, స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడి పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను చట్టపరంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్ పరిధిలో బీట్ వ్యవస్థ అమలు, రాత్రి గస్తీ, నేరాల నియంత్రణ చర్యలు తదితర అంశాలపై ఎస్పీ గారు సమీక్ష నిర్వహించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులు మరియు నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, నేరాలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఫిర్యాదులపై వేగంగా స్పందిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేయాలని, గంజాయి, డ్రగ్స్, నిషేధిత పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగించాలని, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గ్రామాలు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ, కేవైసీ, ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లు, డిజిటల్ అరెస్ట్ వంటి మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని, ప్రమాదకర డ్రైవింగ్, మైనర్ల వాహనాల వినియోగం, మోడిఫైడ్ సైలెన్సర్ల పై చట్టపరమైన చర్యలు కొనసాగించాలని తెలిపారు. ఎస్పి గారి వెంట డిఎస్పి రాములు ,ఎస్.ఐ లు శ్యామ్ రాజ్, గంగాధర్ మరియు సిబ్బంది ఉన్నారు.

# కలం సేవకు.. వృద్ధాప్యంలో భరోసా ఏది?

**60 ఏళ్లు దాటిన ప్రతి జర్నలిస్టుకు పెన్షన్ ఇవ్వాలి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలి**

ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకం. అధికారంలో ఉన్న ప్రభుత్వాల విధానాలను ప్రజలకు చేరవేయడం.. ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడం.. పాలనలో లోపాలను ఎత్తిచూపడం.. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను వెలుగులోకి తీసుకురావడం వంటి బాధ్యతలను పాత్రికేయులు నిరంతరం నిర్వర్తిస్తున్నారు. కానీ జీవితాంతం కలం సేవ చేసిన జర్నలిస్టుల వృద్ధాప్య జీవితానికి మాత్రం సరైన ఆర్థిక భరోసా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. 60 ఏళ్లు దాటిన ప్రతి అర్హత కలిగిన జర్నలిస్టుకు వృద్ధాప్య పెన్షన్ అందించే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలనే డిమాండ్ ఊపందుకుంటోంది.

**యవ్వనమంతా వృత్తికే.. వృద్ధాప్యంలో వెతలు...**

జర్నలిజం వృత్తిలోకి అడుగుపెట్టిన నాటి నుంచి అనేక మంది పాత్రికేయులు ఆర్థికపరమైన ఒడిదుడుకులు, వృత్తిపరమైన ఒత్తిళ్లు, సామాజిక సవాళ్లను ఎదుర్కొంటూనే ప్రజల కోసం పనిచేస్తున్నారు. వార్త కోసం రాత్రింబవళ్లు తిరగడం.. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, ప్రజా ఆందోళనలు, ఎన్నికలు వంటి సందర్భాల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించడం పాత్రికేయ వృత్తిలో భాగమైంది.ఇంతకాలం సమాజం కోసం పనిచేసిన జర్నలిస్టులు వృద్ధాప్యంలోకి వచ్చిన తర్వాత ఆదాయం తగ్గిపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుటుంబ అవసరాలు, వైద్య ఖర్చులు, రోజువారీ జీవన వ్యయాలు భారంగా మారుతున్నాయి. వృత్తి జీవితంలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు పరిచయం చేసిన జర్నలిస్టులే.. వృద్ధాప్యంలో ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి రావడం బాధాకరం.

**పెన్షన్లలో జర్నలిస్టులకు ఎందుకు చోటు లేదు?**

సమాజంలోని వివిధ వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు అనేక పింఛను పథకాలను అమలు చేస్తున్నాయి. అర్హత ఉన్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితరులకు సామాజిక భద్రత కల్పిస్తున్నాయి. అదే తరహాలో సుదీర్ఘకాలం జర్నలిజం వృత్తిలో కొనసాగిన వృద్ధ పాత్రికేయులకు కూడా ప్రత్యేక పెన్షన్ పథకాన్ని ఎందుకు అమలు చేయకూడదన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. జర్నలిస్టులకు ఇచ్చే పెన్షన్‌ను కేవలం సంక్షేమ పథకంగా చూడకుండా ప్రజాస్వామ్య వ్యవస్థకు వారు అందించిన సేవలకు గుర్తింపుగా పరిగణించాల్సిన అవసరం ఉంది.

**60 ఏళ్లు దాటితే కనీస భరోసా...**

జర్నలిజం రంగంలో కనీసం 20, 25 లేదా 30 సంవత్సరాలు సేవలందించిన వారిని గుర్తించి.. 60 ఏళ్లు దాటిన తర్వాత నెలవారీ గౌరవ పెన్షన్ అందించే విధానాన్ని ప్రభుత్వం రూపొందించవచ్చు. అక్రిడిటేషన్, వృత్తి అనుభవం, సంస్థలో పనిచేసిన కాలం, ప్రచురితమైన వార్తా కథనాలు తదితర పారదర్శక ప్రమాణాల ఆధారంగా అర్హులను గుర్తించే అవకాశం ఉంది.దీనివల్ల నిజంగా జర్నలిజానికి జీవితాన్ని అంకితం చేసిన వారికి మాత్రమే ప్రయోజనం అందుతుంది. అనర్హులకు అవకాశం లేకుండా ప్రత్యేక పరిశీలనా వ్యవస్థను ఏర్పాటు చేయవచ్చు.

**కేంద్రం కూడా ముందుకు రావాలి...**

జర్నలిస్టుల వృద్ధాప్య భద్రత రాష్ట్ర ప్రభుత్వాలకే పరిమితం కాకుండా కేంద్ర ప్రభుత్వం కూడా జాతీయ స్థాయిలో ప్రత్యేక విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది. దేశవ్యాప్తంగా సుదీర్ఘకాలం సేవలందించిన వృద్ధ జర్నలిస్టులకు కనీస ఆర్థిక భరోసా కల్పించేలా కేంద్ర పథకాన్ని తీసుకురావాలి.రాష్ట్రాలు తమ పరిధిలో అదనపు సహాయం అందించేలా సమగ్ర విధానాన్ని రూపొందిస్తే దేశవ్యాప్తంగా జర్నలిస్టుల వృద్ధాప్య భద్రతకు బలమైన వ్యవస్థ ఏర్పడుతుంది.

**కలం బలానికి.. ప్రభుత్వ అండ...**

జర్నలిస్టు తన కలంతో ప్రజల సమస్యలను ప్రశ్నిస్తాడు. ప్రజల తరఫున అధికారాన్ని నిలదీస్తాడు. అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తాడు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తాడు. ఎన్నికల సమయంలో ఓటర్లకు సమాచారం అందిస్తాడు. విపత్తుల సమయంలో క్షేత్రస్థాయిలో పరిస్థితులను ప్రపంచానికి తెలియజేస్తాడు. అలాంటి వృత్తికి జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి వృద్ధాప్యంలో ఒంటరిగా ఆర్థిక ఇబ్బందులు పడకుండా చూడటం ప్రభుత్వాల బాధ్యత. జర్నలిస్టుల సంక్షేమం అంటే కేవలం ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు, వైద్య సదుపాయాలకే పరిమితం కాకూడదు. వృద్ధాప్య భద్రత కూడా అందులో కీలక భాగం కావాలి.

**ఇది దయ కాదు.. సేవకు గుర్తింపు...**

60 ఏళ్లు దాటిన జర్నలిస్టులకు పెన్షన్ ఇవ్వాలనే డిమాండ్ ప్రభుత్వాన్ని కోరే దయాధర్మం కాదు. దశాబ్దాల పాటు ప్రజాస్వామ్యానికి, సమాజానికి, ప్రజలకు వారు చేసిన సేవకు ఇచ్చే గౌరవం. కలం పట్టిన చేతులకు వృద్ధాప్యంలో చేయూత అందితేనే జర్నలిస్టుల సంక్షేమం సంపూర్ణమవుతుంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక విధానాన్ని రూపొందించి, సుదీర్ఘకాలం జర్నలిజంలో పనిచేసిన 60 ఏళ్లు పైబడిన అర్హులైన పాత్రికేయులకు నెలవారీ పెన్షన్ అందించేందుకు చర్యలు చేపట్టాలి. కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే దిశగా జాతీయ స్థాయి పథకాన్ని తీసుకురావాలి. జీవితాంతం సమాజం కోసం వార్తలు రాసిన జర్నలిస్టుల వృద్ధాప్య కథ మాత్రం కన్నీటితో ముగియకుండా.. ప్రభుత్వ భరోసాతో సాగాలి.



**డాక్టర్ సయ్యద్ ఇక్రాముల్లా హుసైనీ**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**సెల్: 9849073143**

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280